క్లుప్తంగా

ఆళ్వార్ దాస్‌కు ఘన నివాళి



ఆళ్వార్‌దాస్‌కు నివాళులు అర్పిస్తున్న సుబ్బారావు, రత్నప్రసాదరావు తదితరులు

కాకినాడ రూరల్: అంతర్జాతీయ వాకర్స్ సంఘ వ్యవస్థాపకుడు, మాజీ మంత్రి ఆళ్వార్ దాస్ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్ర పటానికి సర్పవరం జంక్షన్‌లో బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో శనివారం నివాళులర్పించారు. గ్రంథాలయ విశ్రాంత ఉద్యోగి చింతపల్లి సుబ్బారావు మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యం అనే లక్ష్యంతో 1986లో అంతర్జాతీయ వాకర్స్ సంఘాన్ని స్థాపించారన్నారు. 2003 జనవరి 20న ఆయన కాలం చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, సత్యనారాయణ, రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

టోల్ గేట్ వద్ద లారీ డ్రైవర్ల ధర్నా



కృష్ణవరం టోల్‌గేట్ వద్ద రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న లారీ డ్రైవర్లు

కిర్లంపూడి: కేంద్ర ప్రభుత్వం హిట్ అండ్ రన్ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ లారీ డ్రైవర్లు కృష్ణవరం టోల్‌గేట్ వద్ద శనివారం ధర్నా చేశారు. కాకినాడ జిల్లా హోరథ సారథి డ్రైవర్స్ అండ్ క్లీనర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ర్యాలీ చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకుడు వాసు మాట్లాడుతూ అనుకోకుండా జరిగే ప్రమాదాలకు డ్రైవర్లను బాధితులను చేస్తూ రూ.7 లక్షల జరిమానా, జైలు శిక్ష విధించడం సరికాదన్నారు. కేంద్ర ప్రభుత్వ హిట్ అండ్ రన్ చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకూ పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ రోడ్డుపైనే బైఠాయించారు. దీంతో సుమారు గంట పాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. జగ్గంపేట సీఐ ఎస్ లక్ష్మణరావు, రోడ్డు సేఫ్టీ, హైవే సిబ్బంది ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

అయోధ్య రాముని విగ్రహ ప్రతిష్ఠ పూజలు

జగ్గంపేట: అయోధ్య రామమందిరంలో స్వామివారి స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ దిగ్విజయంగా జరగాలని కోరుతూ జగ్గంపేటలోని విష్ణాలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మహిళలు స్వామివారికి పూజలు, అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకులు పి.శ్రీనివాస్ దాసాంజనేయస్వామి వారికి పంచామృత అభిషేకం, సహస్ర నామార్చన, సుందరకాండ పారాయణ, విశేష పూజలు చేశారు. అయోధ్యలో రామమందిరం ప్రారంభోత్సవ సందర్భంగా 22న రాజగోపాలస్వామి రామావతారంలో దర్శన మిస్తారని తెలిపారు. మహిళా సంఘం నేతలు ధారా లక్ష్మి, కొత్త చంద్రిక తదితరులు పాల్గొన్నారు.

హరిదాసుకు సత్కారం



జె.కొత్తూరులో హరిదాసు కృష్ణను సత్కరిస్తున్న గ్రామ పెద్దలు

జగ్గంపేట: మండలంలోని జె.కొత్తూరులో శనివారం హరిదాసును ఘనంగా సన్మానించారు. సంక్రాంతి సందర్భంగా భద్రాచలం వద్ద కూనవరం నుంచి వచ్చి నెల రోజుల పాటు జె.కొత్తూరులో నగర సంకీర్తన నిర్వహించిన హరిదాసు కృష్ణను గ్రామ పెద్దలు, చిన్నయ్యపేట యూత్ సభ్యుల ఆధ్వర్యంలో శాలువా, పూలమాలతో సత్కరించి రూ.20 వేలు, కొత్త దుస్తులు అందజేశారు. మన సంస్కృతి, సంప్రదాయాలపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని కోరారు. పలువురు గ్రామ పెద్దలు, చిన్నయ్యపేట యూత్ సభ్యులు పాల్గొన్నారు.

తాటాకిల్లు దగ్ధం

రూ. 4 లక్షల ఆస్తినష్టం

కోటనందూరు: మండలంలోని అల్లిపూడి ఎస్సీ కాలనీ–2లో శుక్రవారం అర్ధరాత్రి తాటాకిల్లు దగ్ధమైంది. వివరాల్లోకి వెళితే... అల్లిపూడి ఎస్సీ కాలనీకి చెందిన చిట్టిమూరి పెద్దిరాజు తన తాటాకింట్లో రోజూ మాదిగానే నిద్రిస్తున్నాడు. అర్ధరాత్రి 12.30 గంటల సమయంలో ఇంటి నుంచి భారీగా మంటలు చెలరేగాయి. ఉక్కిరిబిక్కిరైన పెద్దిరాజు ఇంటి నుంచి బయటకు పరుగులు తీశాడు. గుర్తు తెలియని వ్యక్తులు తలుపు గొళ్లెం పెట్టి ఇంటికి నిప్పు అంటించారని బాధితుడు ఆరోపించాడు. ఈ ప్రమాదంలో రూ. 1.5 లక్షల నగదుతో పాటు టీవీ, రిఫ్రిజిరేటర్, బీరువా తదితర వస్తువులు కాలి బూడిదయ్యాయి. రూ.4 లక్షల వరకూ ఆస్తినష్టం జరిగినట్టు బాధితుడు తెలిపారు. వీఆర్వో వెంకటరమణ సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు నమోదు చేశారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చింతకాయల చినబాబు బాధితుడిని పరామర్శించారు.

జగనన్నే మా నమ్మకం

- ముక్తకంఠంతో చెప్పున్న ప్రజలు
- ఉత్సాహంగా వై ఏపీ నీడ్స్ జగన్
- ఇప్పటికి 38 సచివాలయాల పరిధిలో పూర్తి
- నియోజకవర్గంలో రూ.615 కోట్ల సంక్షేమం



సూర్యారావుపేటలో ఇటీవల వైఎస్సార్ సీపీ జెండాను ఎగరవేస్తున్న పార్టీ నాయకులు

కాకినాడ రూరల్: ప్రజలంతా మా నమ్మకం నువ్వే జగనన్నా అంటున్నారు. ఏపీకి మళ్లీ జగనే రావాలని కోరుకుంటున్నారు. 2019 ఎన్నికల ముందు పాదయాత్ర ద్వారా ప్రజల కష్టాలను తెలుచుని వారిని ఆర్థికంగా ఆదుకునేందుకు నవరత్న సంక్షేమ పథకాలు ప్రకటించిన వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు విశ్వసించారు. వారి విశ్వాసం వమ్ము కాకుండా అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి హోదాలో సంక్షేమ పథకాలు తూచ తప్పకుండా అమలు చేశారు. ప్రజలకు సకాలంలో నేరుగా సంక్షేమ పథకాలు అందించేందుకు పాలన పరంగా గ్రామ సచివాలయ వ్యవస్థ, వలంటీర్ వ్యవస్థలను తీసువచ్చారు. హామీలను అమలు చేయడంతో సంక్షేమ పథకాల లబ్ధిని, అభివృద్ధిని తెలియజేస్తూ గ్రామాల్లో ఉత్సాహంగా వై ఏపీ నీడ్స్ జగన్ నిర్వహిస్తున్నారు. వైఎస్సార్ పెన్షన్ కానుక, జగనన్న అమ్మ ఒడి, జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన, జగనన్న విదేశీ విద్యాదీవెన, వైఎస్సార్ రైతు భరోసా, డాక్టర్ వైఎస్సార్ ఉచిత పంటల బీమా, వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాలు, రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, మత్స్యకారులకు వేట నిషేధ భృతిగా వైఎస్సార్ మత్స్యకార భరోసా, వైఎస్సార్ చేయూత, ఆసరా, సున్నా వడ్డీ, వైఎస్సార్ కాపు నేస్తం, ఈబీసీ నేస్తం, ఆరోగ్య శ్రీ, వాహన మిత్ర, నేతన్న నేస్తం.. ఇలా అనేక సంక్షేమ పథకాలకు నేరుగాను, మరి కొన్ని పథకాలకు నాన్ డీబీటీ ద్వారా లబ్ధి చేకూర్చారు. వీటితో గ్రామాలలో జరిగిన అభివృద్ధిని తెలియజేసేందుకు అధికారులు, ప్రజా ప్రతినిధులు వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం గ్రామాలలో ఉత్సాహంగా నిర్వహిస్తున్నారు. సచివాలయాల వారీగా గత ఏడాది చివర్లో ప్రారంభమైన ఈ కార్యక్రమం ముగింపు దశకు చేరుకుంది. కాకినాడ రూరల్ మండలంలో 41 సచివాలయాలకు ఇప్పటికి తూరంగిలో మూడు సచివాలయాలు మినహా మిగిలిన 38 సచివాలయాలలో ముగిశాయి. మండలంలో సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారులకు సుమారు రూ.615 కోట్లను ప్రభుత్వం పంపిణీ చేసింది. సుమారు రూ.82 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. వీటిని అధికారులు గ్రామ సభలో తెలియజేస్తూ డిస్‌ప్లే బోర్డులో వివరాలు ప్రదర్శిస్తున్నారు. అనంతరం వైఎస్సార్ సీపీకి చెందిన నాయకులు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ఇంటికి వెళ్లి ఏపీకి మళ్ళీ జగనే ఎందుకు కావాలో వివరిస్తూ ముందుకు సాగుతున్నారు.



సంక్షేమ పథకాలు అందుకున్న లబ్ధిదారుల వివరాలతో పెట్టిన బోర్డు

సంక్షేమ పథకాలు ప్రదర్శిస్తున్నాం



రాష్ట్ర ప్రభుత్వం ద్వారా గ్రామ సచివాలయాల పరిధిలో సంక్షేమ పథకాలు పొందిన లబ్ధిదారులు వివరాలు ప్రదర్శిస్తున్నాం. లబ్ధిదారులు పెద్ద ఎత్తున కార్యక్రమానికి హాజరవుతున్నారు.

– రామాంజనేయులు, ఈఓ పీఆర్ అండ్ ఆర్డీ, కాకినాడ రూరల్

ప్రజల్లో అనూహ్య స్పందన



వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన వస్తోంది. అధికారులు సంక్షేమ పథకాలు, అభివృద్ధిని తెలియజేస్తున్నారు. గ్రామ సభ అనంతరం వైఎస్సార్ సీపీ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు కలిసి ఇంటింటికీ ప్రచారం చేస్తుంటే ప్రజలు సానుకూలంగా స్పందిస్తూ మళ్లీ జగనే కావాలని కోరుకుంటున్నారు.

– గీసాల శ్రీనివాసరావు, జేసీఎస్ మండల కన్వీనర్, కాకినాడ రూరల్

రేపు సెలవు దినంగా ప్రకటించాలి



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న రామకుమార్

బోట్‌క్లబ్: అయోధ్యలో రామ్ లాలా విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా సోమవారం ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలకు, పాఠశాలలకు సెలవుదినంగా ప్రకటించాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి యార్లగడ్డ రామకుమార్ డిమాండ్ చేశారు. స్థానిక గాంధీ నగర్‌లో శనివారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. దేశంలోని అన్ని వర్గాలు ఈ కార్యక్రమాన్ని తిలకించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ప్రకటించాలన్నారు. ఇప్పటికే పలు రాష్ట్రాలు సెలవుదినంగా ప్రకటించాయని, రాష్ట్ర ప్రభుత్వం ప్రజాభీష్టం మేరకు ఆ కార్యక్రమాన్ని తిలకించేలా సెలవు ప్రకటించాలని కోరారు. రాష్ట్రంలో ఆ రోజు లిక్కర్ షాపులను బార్లను బంద్ చేయాలన్నారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకుడు దువ్వూరి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ప్రజాసంఘాల రాస్తారోకో

కాకినాడ సిటీ: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శనివారం ఇంద్రపాలెం లాకుల వద్ద రాస్తారాకో నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు దువ్వా శేషుబాబ్జీ, తిరుమలశెట్టి నాగేశ్వరరావు, గొడుగు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



రెండు దశాబ్దాల తర్వాత కలుసుకున్న స్నేహితులు

20 ఏళ్లకు కలిశారు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): రెండు దశాబాల తర్వాత 2004 పదవ తరగతి పూర్వ విద్యార్థులు శనివారం స్థానిక చిసెల్ జిమ్ ఆవరణలో కలుసుకున్నారు. గిల్డ్ ఆఫ్ సర్వీస్ హైస్కూల్‌లో చదువుకున్న పూర్వ విద్యార్థులు తమకు పాఠశాలలో బోధించిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఏటా స్నేహితులంతా కలుసుకోవాలని నిర్ణయించుకుని, ఆపదలో ఉన్న స్నేహితులకు చేయూతనిచ్చే విధంగా తీర్మానించుకున్నారు. స్నేహితుల సమ్మేళనంలో పాల్గొన్న వారికి జ్ఞాపిక అందజేశారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన స్నేహితులందరిని ఒకచోటకు చేర్చి స్నేహితుల సమ్మేళనానికి కృషి చేసిన మారుతి, రఘురాం, హిమబిందు, నరేంద్ర, వెంకటరమణలను తోటి స్నేహితులు అభినందించారు.

రేపటి నుంచి వికసిత్ భారత్ సంకల్పయాత్ర

- కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన సదస్సులు
- కమిషనర్ నాగ నరసింహారావు వెల్లడి



సమీక్షిస్తున్న కమిషనర్ నాగ నరసింహారావు

కాకినాడ: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సోమవారం నుంచి 29 వరకు వికసిత్ భారత్ సంకల్పయాత్ర పేరిట అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు చెప్పారు. కార్యక్రమ నిర్వహణపై శనివారం నగరపాలక సంస్థ కార్యాలయంలో వివిధ విభాగాధిపతులు, ప్రత్యేక అధికారులతో కమిషనర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 22వ తేదీన స్థానిక వివేకానంద పార్క్ ఆవరణలోని రాగిరెడ్డి కళాక్షేత్రంలో ప్రారంభ కార్యక్రమం జరుగుతుందన్నారు. అనంతరం కాకినాడలోని 14 వేర్వేరు ప్రాంతాల్లో 29వ తేదీ వరకు కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. వికసిత్ భారత సంకల్పయాత్రను పర్యవేక్షించేందుకు కేంద్ర ప్రభుత్వ సీనియర్ అధికారి పియూష్ కుమార్ రానున్నట్టు తెలిపారు. పీఎం స్వనిధి, ఉజ్వల యోజన, ముద్ర, ఆయుష్మాన్ భారత్, పీఎం ఆవాస్ యోజన, స్వచ్ఛభారత్ అభియాన్, వంటి సుమారు 15 పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తారన్నారు. ఆయా కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించి సమగ్ర సమాచారాన్ని సిద్ధం చేసి ఉంచాలని, ఆ మేరకు ఆయా శాఖల అధికారులకు సమాచారం అందించాలని కమిషనర్ ఆదేశించారు. ప్రారంభం రోజున ఐదు అంశాలపై సమావేశ ప్రాంగణంలో ప్రత్యేక శిబిరాలను కూడా నిర్వహిస్తారన్నారు. కార్యక్రమ నిర్వహణకు నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబును నోడల్ అధికారిగా నియమిస్తున్నట్లు కమిషనర్ చెప్పారు. ఆయన పర్యవేక్షణలో ఆయా డివిజన్లకు చెందిన ప్రత్యేక అధికారులు, ఇతర శాఖలను సమన్వయం చేసుకొని కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా పటిష్ట ప్రణాళికతో ముందుకు వెళ్లాలని కమిషనర్ నాగ నరసింహారావు ఆదేశించారు. సమావేశంలో ఎస్ఈ పి.సత్య కుమారి, నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబు, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్ ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీ చరణ్, డీసీపీ హరిదాసు, ఏసీపీ నాగశాస్త్రులు, స్మార్ట్ సిటీ ఎస్ఈ పి.వెంకటరావు, మేనేజర్ కర్రి సత్యనారాయణ, ఈఈ మాధవి, టీపీఆర్ఓ మానే కృష్ణమోహన్, ఉద్యాన సహాయ సంచాలకుడు టీవీ శిరిల్, ఏవో శిరీష్, సిటీ మిషన్ మేనేజర్ డేగల వెంకటరాజు, పలువురు సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

ముగ్గురికి ఎన్ఎంఎం స్కాలర్‌షిప్



కొత్తూరి అఖిల్‌కుమార్



పుర్రె పవన్ కుమార్



అయిరాపు హర్షిత

కరప: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ (ఎన్ఎంఎం) స్కాలర్‌షిప్‌కు కరప మండలం అరట్లకట్ట ముత్యాల సుబ్బన్న మెమోరియల్ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ముగ్గురు ఎంపికయ్యారు. అరట్లకట్ట హైస్కూలులో 8వ తరగతి చదువుతున్న కొత్తూరి అఖిల్‌కుమార్, పుర్రె పవన్‌కుమార్, అయిరాపు హర్షిత ఎంపికైనట్టు హెచ్ఎం డాక్టర్ పి.వెంకటశివగిరి తెలిపారు. గత ఏడాది జరిగిన ఎంపిక పరీక్షలో తమ పాఠశాల విద్యార్థులు ఉపకార వేతనం పొందేందుకు ఎంపికయ్యారన్నారు. ఏడాదికి రూ 12 వేలు వంతున 9, 10 తరగతుల్లోను ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాలలో ఈ ఉపకారవేతనం అందజేస్తారన్నారు. ఎన్ఎంఎం స్కాలర్‌షిప్‌కు ఎంపికై న విద్యార్థులను, తర్ఫీదునిచ్చిన గణిత ఉపాధ్యాయుడు ఎం.శ్రీనివాసరావును సర్పంచ్ గోపి సత్యవేణి, జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, ఎంఈఓలు కె.బుల్లికృష్ణవేణి, పి.సత్యనారాయణ, హెచ్ఎం డాక్టర్ వెంకట శివగిరి అభినందించారు.

ఉత్తమ క్రీడాకారులుగా ఎదగాలి

- కమిషనర్ నాగ నరసింహారావు
- ఆడుదాం ఆంధ్రా జట్లకు కిట్ల పంపిణీ



క్రీడాకారులకు కిట్లు పంపిణీ చేస్తున్న కమిషనర్ నాగ నరసింహారావు

కాకినాడ: ప్రతిభ కలిగిన క్రీడాకారులను అన్ని విధాలా ప్రోత్సహించాలనే లక్ష్యంతోనే ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర పేరిట వివిధ క్రీడా పోటీలను నిర్వహిస్తోందని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు పేర్కొన్నారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయ ఆవరణలో శనివారం ఆడుదాం ఆంధ్ర పోటీలలో మండల స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీలను తొలుత సచివాలయ పరిధిలో నిర్వహించి అక్కడ ప్రతిభ చూపిన వారిని నాలుగు మండలాలుగా విభజించి తుది పోటీలకు ఎంపిక చేశామన్నారు. నాలుగు మండలాల నుంచి 40 జట్లను ఎంపిక చేసి నియోజకవర్గస్థాయి లో పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ జట్లకు ఆయా క్రీడల కిట్లను పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం. ఏసుబాబు, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, మేనేజర్ కర్రి సత్యనారాయణ, టీపీఆర్ఓ మానే కష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక ఉరుస్



దర్గా వద్దకు గంధాన్ని తీసుకువస్తున్న ముస్లిం సోదరులు

- మున్సిపల్ వైస్ చైర్మన్ సాయి ప్రసాద్

పెద్దాపురం: మత సామరస్యానికి ప్రతీకగా స్థానిక తొమ్మిది మూరల సాయిబు ఉరుస్ ఉత్సవం దోహదపడతుందని మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డు తులసీ మంగ తాయారు, వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, కనకాల మహాలక్ష్మి, అగ్రో డైరెక్టర్ సయ్యద్ జానీ, స్థానిక ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. స్థానిక షేక్ హజరత్ పాచ్చా ఔలియా (తొమ్మిది మూరల సాయిబు) సమాధి వద్ద శనివారం రాత్రి నిర్వహించిన ఉరుస్ వారు ప్రారంభించారు. ముస్లిం పెద్దలు అబ్దుల్ గఫర్‌ఖాన్, ఎండి లాయక్ అలీ, ఎంఎల్ అలీ నిర్వహించిన ముస్లిం ప్రార్థనల్లో వారు భాగస్వాములై మసీదులోని సాయిబు సమాధి వద్ద నివాళులర్పించారు. వైస్ చైర్మన్ సాయి ప్రసాద్ మాట్లాడుతూ హిందూ ముస్లిం, క్రైస్తవులు ఐక్యంగా ఏటా ఉరుస్ జరుపడం అభినందనీయమన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ముస్లింలకు అధిక ప్రాధాన్యతమిచ్చి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇమామ్‌లకు జీతాలతో పాటు అన్ని విధాల ఆదుకుంటున్నారన్నారు. ఎమ్మెల్యే రాజజ్ప మాట్లాడుతూ పెద్దాపురం రాజా వారి వద్ద సైనికుడిగా పని చేసిన తొమ్మిది మూరల హజరత్ షా రహమ్‌తుల్లా అల్లా ద్వారా మహిమను పొందిన వ్యక్తిగా ప్రజల పూజలు అందుకుంటున్నారన్నారు. ఈ సందర్భంగా స్థానిక ఎండీ సతార్ ఇంటి వద్ద నుంచి గుర్రపు గంధాన్ని ఊరేగింపుగా సమాధి వద్దకు తీసుకురాగా సాయిబు సమాధిపై గంధాన్ని పూసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం మిమిక్రీ, మ్యూజికల్ నైట్, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు నిర్వహించిన ఆత్మీయ విందును సాయి ప్రసాద్ ప్రారంభించారు. మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యులు షేక్ రఫీ, కౌన్సిలర్ విడదాసరి రాజా, టీడీపీ నాయకులు తూతిక రాజు, రాజా సూరిబాబు రాజు, అబ్దుల్ రజాక్, పలువురు ముస్లింలు, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ప్రవీణ్ శాక్సోఫోన్ కచేరీ



శాక్సోఫోన్ వాయిస్తున్న ప్రవీణ్ పండిట్

బోట్‌క్లబ్: సంగీత విద్వత్సభ ఆధ్వర్యంలో సూర్యకళా మందిరంలో జరుగుతున్న సంక్రాంతి సంగీత సభల్లో భాగంగా శనివారం రాత్రి చెన్నైకి చెందిన ప్రవీణ్ పండిట్ శాక్సోఫోన్ వాయిద్యంతో ప్రేక్షకులను అలరించారు. హంసధ్వని రాగంలో వాతాపి గణపతిం భజే, శ్రీరాగంలో ఎందరో మహానుభావులు, అభేరి రాగంలో నగుమోము గనలేని మొదలైన కీర్తనలు వాయించారు. వీరికి వయోలిన్‌పై బసవరాజు రాఘవేంద్రరావు, ఆంబూర్‌పై పద్మనాభన్ మృదంగంపై కేవీ వెంకట సుబ్రహ్మణ్యం చక్కటి సహకారాన్ని అందించారు. తొలుత కార్యక్రమాన్ని ముంజులూరి విశ్వేశ్వర రావు, రాయవరపు సంజీవరావు, ప్రభల రాజేశ్వరి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ధూళిపాళ నరేంద్ర వ్యాఖ్యలు సరికావు

వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ ఇన్‌చార్జి గుల్లా

గోకవరం: పాన్నూరు మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నాయకుడు ధూళిపాళ నరేంద్ర చేసిన వ్యాఖ్యలు సరైనవి కావని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జోనల్ ఇన్‌చార్జి గుల్లా ఏడుకొండలు అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. టీడీపీ, జనసేన కూటమి అధికారంలోకి వస్తే విజయవాడలో నిర్మించిన అంబేడ్కర్ విగ్రహాన్ని కూలగొడతామని ధూళిపాళ అన్నట్టుగా వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోందని, అదే నిజమైతే ఆ వ్యాఖ్యలు సరైనవికావన్నారు. దళితుల మనోభావాలను గౌరవించి, తమ ఆత్మాభిమానం పెంపొందించేలా సీఎం జగన్ మోహన్‌రెడ్డి అంబేడ్కర్ స్మృతివనాన్ని నిర్మించి ప్రారంభించారన్నారు. ఇటువంటి మంచి కార్యక్రమానికి రాజకీయ రంగు పులమడం దురదృష్టకరమన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీకి దళితులు బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

పశువుల పాక దగ్ధం

- మూడు దూడలు సజీవ దహనం
- రెండు గేదెలకు తీవ్ర గాయాలు

పిఠాపురం: పిఠాపురం మండలం వెల్దుర్తిలో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు అటించడంతో పశువుల పాక దగ్ధమైంది. ఈ ప్రమాదంలో మూడు దూడలు సజీవ దహనం కాగా రెండు గేదెలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక పోలీసుల కథనం ప్రకారం... వెల్దుర్తిలో పాలపర్తి దొరబాబుకు చెందిన పశువుల పాకకు శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు. అప్పటివరకు పొలంలో ఉన్న దొరబాబు ఇంటికి భోజనానికి వెళ్లాడు. భోజనం చేసి మళ్లీ పొలంలోకి వెళదామనుకున్నాడు. కొంచెం పని ఉండడంతో ఇంటి దగ్గరే ఉండిపోయాడు. ఇంతలో తన పశువుల పాకలో అగ్నిప్రమాదం సంభవించినట్లు స్థానికులు చెప్పడంతో పరుగున పొలంలోకి వెళ్లగా అప్పటికే పాక పూర్తిగా దగ్ధమైంది. పాకలోని కట్టేసి ఉన్న మూడు దూడలు సజీవ దహనమయ్యాయి. రెండు గేదెలకు తీవ్ర గాయాలయ్యాయి. పశువులు కట్టేసి ఉండడంతో తప్పించుకునే వీలు లేక అగ్నికి ఆహుతయ్యాయి. ప్రమాద విషయం తెలుసుకున్న పిఠాపురం అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. కాగా అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. పిఠాపురం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రతిరోజూ పొలంలో నిద్రించే తనను పాత కక్షలతో చంపాలని పథకం ప్రకారమే పాకకు నిప్పు అంటించారని బాధితుడు దొరబాబు ఆరోపించారు. పోలీసులు ఆకోణంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపించి, దోషులను కఠినంగా శిక్షించాలని బీజేపీ సమన్వయకర్త బీవీకే రాజు డిమాండ్ చేశారు. బీజేపీ నాయకులతో కలిసి శనివారం ఆయన ప్రమాద స్థలాన్ని పరిశీలించారు.

వాడవాడలా రామనామస్మరణ

- రేపు అయోధ్యలో రాముని విగ్రహ ప్రతిష్ఠ
- బైక్ ర్యాలీలు, సంగీత కార్యక్రమాల నిర్వహణ
- నేడు కాకినాడలో రామరాజ్య శోభాయాత్ర

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): రామ జన్మభూమి అయోధ్యలో రాముని విగ్రహ ప్రతిష్ఠ సోమవారం నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో గ్రామాల్లో రామనామ స్మరణ చేస్తున్నారు. 500 ఏళ్ల నాటి కల నెరవేరుతున్న ఈ తరుణాన్ని హిందువులు ఓ పండగలా జీవితంలో గుర్తుంచుకునేలా పలు కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇప్పటికే విశ్వ హిందూ పరిషత్‌తో పాటు పలు హిందూ ధార్మిక సంఘాలు రాముని పూజాక్షతలు జిల్లాలో ప్రతీ ఇంటికి పంపిణీ చేశారు.

సోమవారం ప్రతి ఇంటి ముందు ముగ్గులు వేసుకుని, గుమ్మాలకు మామిడి తోరణాలు కట్టుకుంటున్నారు. ప్రతి ఇంటా సాయంత్రం దీపాలు వెలిగించాలని, కాషాయ జెండా ఎగురవేయాలని పలు ధార్మిక సంస్థలు ప్రచారం చేస్తున్నాయి.

గ్రామాల్లో భజనలు, శోభాయాత్రలు

జిల్లాలోని ప్రతి గ్రామంలోను సోమవారం అయోధ్య రాముని ప్రతిష్ఠ సందర్భంగా శోభాయాత్రలు నిర్వహిస్తున్నారు. గ్రామంలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు, భజనలు, రామనామ కీర్తనలకు ఏర్పాట్లు చేస్తున్నట్టు విశ్వహిందూపరిషత్ సహాయ కార్యదర్శి జి.ఉదయ భానోజీరావు పేర్కొన్నారు.

రాముని ప్రతిష్ఠ సందర్భంగా నగరంలో రామరాజ్య శోభాయాత్ర చేస్తున్నారు. ఈ సందర్భంగా భారీ బైక్ ర్యాలీ నిర్వహించనున్నారు. స్థానిక రిజర్వులైన్ అయ్యప్పస్వామి ఆలయం నుంచి మధ్యాహ్నం 3 గంటలకు యాత్ర నిర్వహిస్తున్నారు. అలాగే సినిమారోడ్డులోని సూర్యకళామందిరంలో స్థానిక కళాకారుల ఆధ్వర్యంలో సంకీర్తనా గానం నిర్వహిస్తున్నారు. అంతర్జాతీయ సంగీత విద్వాంసురాలు పెద్దాడ సూర్యకుమారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

సారా తరలిస్తున్న మహిళ అరెస్ట్

కొత్తపల్లి: సారా తరలిస్తున్న మహిళను అరెస్ట్ చేసినట్లు స్థానిక పోలీసులు శనివారం తెలిపారు. వివరాల్లోకి వెళితే...మండలంలోని కొత్తమూలపేటకు చెందిన కోణాల చక్రమ్మ సారా తరలిస్తుందని సమాచారం రావడంతో ఎస్సై స్వామినాయుడు తన సిబ్బందితో దాడి చేశారు. చక్రమ్మను అరెస్ట్ చేసి ఆమె నుంచి 30 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. ఆమెపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.